www.prajasakti.com
ప్రజాశక్తి
5
ఆదివారం 9 ఫిబ్రవరి 2025
వైఎస్ఆర్



కోదండరామాలయానికి బడ్జెట్‌లో నిధులు కేటాయించాలి

ప్రజాశక్తి-ఒంటిమిట్ట : కోదండరామాలయానికి రాష్ట్ర ప్రభుత్వ బడ్జెట్‌లో నిధులు కేటాయించి అభివృద్ధి చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు [illegible], మండల కార్యదర్శి నరసయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఒంటిమిట్ట అభివృద్ధి చేయాల్సిన అవసరముందన్నారు. ఆలయానికి స్వయం ప్రతిపత్తి కల్పించాలన్నారు. ముకుంద ఆశ్రమం మాధవరం చుట్టుపక్క గ్రామాలలో సిమెంట్ రోడ్లు విద్యుత్ ఎల్ఈడి బల్బులు ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. ఒంటిమిట్ట రైల్వే స్టేషన్ ఆధునీకరించాలని తెలిపారు. గతంలో వెంకటాద్రి రాయలసీమ తదితర ఎక్స్‌ప్రెస్ ఆపేవారని, వాటిని పునరుద్ధరించి పర్యాటకులకు రైలు సౌకర్యాలు కల్పించాలన్నారు. ఒంటిమిట్ట చెరువు సుందరీకరణ చేసి నీళ్లలో బోట్లు ఏర్పాటు చేసి పర్యాటకులకు వినోదంగా తీర్చిదిద్దాలన్నారు. జగనన్న కాలనీలకు నిధులు కేటాయించి ఇండ్ల నిర్మాణాలు పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు రాము వెంకటేష్ పాల్గొన్నారు.

బుడ్డశనగపై గోలగోల!

- నకిలీ విత్తన విక్రేతలపై కేసులు
- ఎంఎస్‌పి ధరను పెంచి ఇవ్వాలి : ఎంపీ
- కుంభగిరి కాలనీ లీకేజీలను అరికట్టండి: ఎమ్మెల్యే సుధా
- సిబిఎస్ఇ విద్యార్థులకు స్టేట్‌సిలబస్ పరీక్షలా : ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి
- తొమ్మిది గంటల విద్యుత్ సరఫరాపై స్పష్టత ఇవ్వండి
- రెండు తీర్మానాలకు ఆమోదం
- కూటమి ఎమ్మెల్యేలు డుమ్మా



సమావేశంలో మాట్లాడుతున్న జెసి అదితిసింగ్

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

ఉమ్మడి జిల్లాలోని బుడ్డశనగ, కందులు, పెసర, నువ్వుల దిగుబడులు గణనీయంగా తగ్గాయని, ఇటువంటి పరిస్థితుల్లో బుడ్డశనగను రూ.5,650 ధరను నిర్ణయించడం దారుణమని కడప ఎంపీ వై.ఎస్ అవినాష్‌రెడ్డి వాపోయారు. శనివారం జిల్లా పరిషత్ ఛైర్మన్ జేష్ఠాధి శారద అధ్యక్షతన నిర్వహించిన సర్వసభ్య సమావేశానికి కలెక్టర్, జాయింట్ కలెక్టర్లు గైర్హాజరైన నేపథ్యంలో కడప ఎంపీ దగ్గర నుంచి జడ్‌పిటిసిల వరకు బయటికి వెళ్లి ఛైర్మన్ ఛాంబర్‌లో నిరీక్షించారు. జడ్‌పి సిఇఒ కలెక్టర్, జాయింట్ కలెక్టర్లను ఫోన్‌లో సంప్రదించారు. అనంతరం జాయింట్ కలెక్టర్ హాజరు కావడంతో సమావేశం ఆలస్యంగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా వ్యవసాయశాఖ సమీక్షలో భాగంగా కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం బుడ్డశనగ విత్తన ధర రూ.7,350 విక్రయించిందని, కొనుగోలు దగ్గరికి వచ్చే సరికి క్వింటాల్ రూ.5,650 ప్రకటించడం ఏమిటని నిలదీశారు. బుడ్డశనగ దిగుబడులు తగ్గిన నేపథ్యంలో ధరను తగ్గించడం దారుణమని, రాష్ట్ర ప్రభుత్వం అదనపు భారాన్ని భరించి రైతులను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. జిల్లాలో 25 శాతం క్రాఫ్ కటింగ్ చేసిన నేపథ్యంలో క్రాఫ్ కటింగ్ ఎప్పుడు చేస్తారని నిలదీశారు. రాష్ట్రప్రభుత్వం క్రాప్ కటింగ్ చేసేసరికి 50 శాతానికిపైగా రైతులు నూర్పిడి చేసుకుని దళారులకు విక్రయించేస్తారని, అప్పుడు రైతులకు బదులు దళారులు లబ్ధి పొందుతారని ఆందోళన వ్యక్తం చేశారు. చక్రాయపేట మండలం కె.రాజుపల్లి తాగునీటి స్కీమ్ చాలా అధ్వానంగా పని చేస్తోందని, 67 గ్రామాలకు 15 గ్రామాలకు సైతం తాగునీటిని సరఫరా చేయడం లేదన్నారు. అనంతరం కడప, అన్నమయ్య జెడిఎలు మాట్లాడుతూ అన్నమయ్య జిల్లాలో రూ.7850 లతో కంది లను కొనుగోలు చేస్తామన్నారు. డ్రోన్ టెక్నాలజీ ఆధారంగా పురుగు మందులను పిచికారీ చేయడం ద్వారా వృథాను అరికట్టవచ్చని తెలిపారు. ఎన్‌పి ఎస్ఎస్ యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకోవడం ద్వారా పంటలకు సోకిన తెగుళ్లను తక్షణమే గుర్తించడం సులభంగా మారిందన్నారు. బి.మఠం ఎంపిపి వీరనారాయణరెడ్డి మాట్లాడుతూ బి.మఠం మండలంలో నకిలీ వరి విత్తనాల కారణంగా రైతులు తీవ్రంగా నష్టపోయారని, నకిలీ విక్రేతలపై కేసులు నమోదు చేయడం ద్వారా నకిలీల బెడదను అధిగమించాలని సూచించారు. దీనికి డిఎఒ స్పందించి నకిలీ విత్తన విక్రేతలపై కేసు నమోదు చేయడంతోపాటు పరిహారం వసూలు చేసే చర్యలు తీసుకుంటామని చెప్పారు. అనంతరం బద్వేల్ ఎమ్మెల్యే డాక్టర్‌సుధ మాట్లాడుతూ పోరుమామిళ్ల ప్రభుత్వాస్పత్రి వైద్యులను డిప్యూటేషన్ వేయడం దారుణమని, రోజుకు 300 మంది రోగులు ఆస్పత్రికి వస్తుంటారని, అటువంటి ప్రాంతం నుంచి పెన్షన్ల రీఅసెస్మెంట్‌కు వేయడం ఏమిటని ప్రశ్నించారు. బద్వేల్ నియోజకవర్గం అట్లూరు మండల పరిధిలోని కుంభగిరి కాలనీలోని పక్కాగృహాలు చిన్నపాటి వర్షానికే ఉరుస్తున్నాయని, వాటి మరమ్మతు నిధులను పెంచడమా, కొత్తగా పక్కాగృహాలను కేటాయించడమా అనేది ఆలోచించాలని డిమాండ్ చేశారు. కమలాపురం సిహెచ్‌సిలో సర్జన్, గైనకాలజిస్టులు లేకపోవడంతో మహిళలు, గర్భిణులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చింతకొమ్మదిన్నె జడ్‌పిటిసి నరేన్ రామాంజులరెడ్డి సభ దృష్టికి తెచ్చారు. జిజిహెచ్ కేన్సర్‌కేర్‌లో స్పెషలిస్టుల కొరత కారణంగా నాణ్యమైన వైద్యసేవలు అందడం లేదన్నారు. ప్రొద్దుటూరు జిజిహెచ్‌లోఎంఆర్ఐ సేవలు చాలా అధ్వానంగా ఉన్నాయని, రోజుల తరబడి తిప్పుకుంటున్నారని, ప్రజాప్రతినిధులు అనే గౌరవం కూడా లేదని, అటువంటి అధికారిపై చర్యలు తీసుకో వాలని యర్రగుంట్ల జడ్‌పిటిసి డిమాండ్ చేశారు. దీనికి జెసి స్పందించి విచారించి చర్యలు తీసుకు ంటామని హామీ నిచ్చారు. పిహెచ్‌సి కేంద్రాల్లో మూడు నెలలకోసారి నిర్వహించాల్సిన సమీక్షా సమావేశాలు నిర్వహించడం లేదన్నారు.



హాజరైన ప్రజాప్రతినిధులు

అనంతరం చక్రాయపేట మండలంలోని 22 మంది ఫీల్డ్ అసిస్టెంట్లలో 15 మందిని తొలగించడం ఏమిటని నిలదీశారు. దీనికి డ్వామా పీడీ స్పందించి చిన్నపాటి లోపాలు ఉంటే హెచ్చరిస్తామని, ఆర్థిక పరమైన తప్పిదాలు ఉంటే తొలగిస్తున్నామని తెలిపారు. అనంతరం చింతకొమ్మదిన్నె జడ్‌పిటిసి నరేన్‌రామాంజులరెడ్డి, వైస్ ఛైర్మన్ బాలయ్యయాదవ్, వీరపునాయునిపల్లి జడ్‌పిటిసిమాట్లాడుతూ జిల్లాలో తొమ్మిది గంటలు కరెంటు ఇస్తున్నారా, ఏడు గంటలు ఇస్తున్నారనే అంశంగా స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. దీనికి ట్రాన్స్‌కో ఎస్ఇ స్పందించి సిఎండి ఆదే శాల మేరకు తొమ్మిది గంటలపాటు ఇస్తున్నామని వివరించారు. జిల్లావ్యాప్తంగా ట్రాన్స్‌ఫార్మర్లు, కండక్టర్లు, మెటీరియల్ కొరత వేధి స్తుండడంపై ఎంపీతోపాటు సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు. అనంతరం పంచాయతీరాజ్‌శాఖ పరిధిలో చింతకొమ్మదిన్నె, జమ్మల మడుగు, రైల్వేకోడూరు, లక్కిరెడ్డిపల్లి ప్రాంతాల్లో అన్‌కనెక్టెడ్ బ్లాగ్స్ ఉన్నాయని, వాటిని కలుపుతూ పిఎంజిఎస్ఐ-4 కింద రహదారి నిర్మా ణాలు చేపట్టాల్సి ఉందన్నారు. గ్రామీణ జనాభా 500 మించిన గ్రామాలను పరిగణలోకి తీసుకోవాల్సిన నేపథ్యంలో ఎక్కువ రహదారుల నిర్మాణాలు చేపట్టలేని పరిస్థితి నెలకొందన్నారు. దీనికి ఎంపీ స్పందించి 250 గ్రామీణ జనాభాను ఆధారంగా తీసుకోవాలని తీర్మా నం చేద్దామని ప్రతిపాదించారు. దీంతో జిల్లావ్యాప్తంగా పలు గ్రా మాల్లో రహదారులు నిర్మించే వెసులుబాటు కలుగుతుందని చెప్పారు. అనంతరం ఎంఎల్‌సి రామచంద్రారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 30 సిబిఎస్ఇ సిలబస్ పాఠశాలల విద్యార్థులను స్టేట్ సిలబస్‌లో పరీక్షలు నిర్వహించడం ఏమిటని, ఇంగ్లీష్ మీడియాన్ని ఎత్తేయాలను కుంటోందా అని ప్రశ్నించారు. సమావేశం ముగింపు నేపథ్యంలో జడ్పీ సిఇఒ స్పందిస్తూ జిల్లాలో అక్రమ మైనింగ్ నివారించాలని, పిఎంజిఎస్‌వై-4 స్కీమ్‌ను 250 గ్రామాలకు వర్తింపజేసేలా తీర్మా నాలను ఆమోదించినట్లు ప్రకటించారు. సమావేశానికి కూటమి తరుపున గెలిచిన ఎమ్మెల్యేలు గైర్హాజరు కావడం గమనార్హం. సమా వేశంలో జెసితోపాటు సిఇఒ, డిప్యూటీ సిఇఒ, ఉమ్మడి జిల్లాకు చెందిన జడ్పీటిసిలు, ఎంపిపిలు, జిల్లా ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఆదినిమ్మాయపల్లి డ్యామ్‌లో పడి ఇద్దరు నేపాల్ యువకులు మృతి

ప్రజాశక్తి - వల్లూరు



బిరేంద్ర బిర్రీ

మండలంలోని ఆదినిమ్మయపల్లి డ్యామ్‌లో పడి నేపాల్‌కు చెందిన ఇద్దరు యువకులు మృతిచెందారు. పోలీసుల వివరాల మేరకు చెన్నూరు మండలం శివరాం దమ్ బిర్యానీ సెంటర్‌లో పనిచేస్తున్న పది మంది యువకులు ఆదినిమ్మాయపల్లి డ్యామ్ వద్దకు సరదాగా గడపడానికి వచ్చారు. ఆనకట్ట వద్ద ఈత కొడుతున్న ఇద్దరు యువకులు బిరేంద్ర (36) బిర్రీ (36) ప్రమాద వశాత్తు నదిలో పడి గల్లంతయ్యారు. మిగిలిన వారు స్థానికులకు, పోలీసులకు సమాచారం అందించారు. జాలర్లు నదిలో దిగి వారిని వెలికి తీయడంతో అప్పటికే మృతిచెందారు. సిఐ రోషన్ సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. హోటల్ యజమాని ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహాలను పోస్టు మార్టం నిమిత్తం కడప రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. మృతులిద్దరికీ వివాహమైంది. కుటుంబం నేపాల్‌లో నివాసముంటున్నారు.

ఎస్ఐ వ్యాఖ్యలు గర్హనీయం

ప్రజాశక్తి -కడప అర్బన్

ఎఎస్ఐ సుధాకర్ ముస్లిముల పట్ల చేసిన వ్యాఖ్యలు గర్హనీయమని బాబు భాయ్ పేర్కొన్నారు. శనివారం ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే మాధవి, టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు శ్రీనివాసరెడ్డి సమక్షంలో ఈ వ్యాఖ్యలు చేయడం దారుణమన్నారు. డిసెంబర్ 6న బాబ్రీ మసీదు కూల్చివేత సందర్భంగా నిరసన తెలిపితే కేసులు పెట్టారని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం ఆర్ఎస్ఎస్ భావజాలం తీసుకువస్తుందని తెలిపారు. శోభాయాత్ర రాష్ట్రంలో ఎక్కడా లేదని కడపలో మాత్రమే నిర్వహించారని చెప్పారు. ప్రభుత్వ ఉద్యోగులు బిజెపి వారిలా మాట్లాడుతూ ఉన్నారని చెప్పారు. ఎఎస్ఐని వెంటనే సస్పెండ్ చేయాలని కలెక్టర్, ఎస్పికి విజ్ఞప్తి చేశారు. సమావేశంలో ఎంఆర్ఎఫ్ నాయకులు దస్తగిరి, పలువురు ముస్లిములు పాల్గొన్నారు.

'ఆప్కాస్' రద్దు నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి

ప్రజాశక్తి - బద్వేలు : మంత్రి వర్గ సమావేశంలో ఆప్కాస్ సంస్థ రద్దు నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షులు కాలువ నాగేంద్ర పేర్కొన్నారు. శనివారం పట్టణంలో సిఐటియు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో ఆప్కాస్ సంస్థను రద్దు పరచి ఆ స్థానంలో ప్రయివేటు ఏజెన్సీలను ప్రవేశపెడతామని నిర్ణయించడం వల్ల ఆప్కాస్‌లో ఉన్న పొరుగు సేవల కార్మికులందరిలోనూ తీవ్ర భయాందోళన నెలకొందని చెప్పారు. ఆప్కాస్‌ను రద్దు చేస్తే తిరిగి దళారీ వ్యవస్థ రంగంలోకి వస్తుందని తెలిపారు. ఉద్యోగాలకు భద్రత లేకుండా పోయే ప్రమాదం ఏర్పడుతుందని చెప్పారు. పొరుగు సేవల కార్మికుల్లో నెలకొన్న భయాందోళనలను తొలగించి ఉద్యోగ భద్రత, భరోసా కల్పించే విధంగా తెలుగుదేశం కూటమి ప్రభుత్వం వెంటనే స్పందించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ఎన్నికల కమిషన్ బిజెపి టూల్ కిట్ : కాంగ్రెస్

ప్రజాశక్తి - కడప : ఢిల్లీ ఎన్నికల్లో ఓటర్లు ఇచ్చిన తీర్పు బిజెపికి వ్యతిరేకమని, కానీ ఇవిఎంలో నమోదైన ప్రతి ఓటూ ఆ పార్టీకి అనుకూలముగా కేంద్ర ఎన్నికల సంఘం రిజిస్టర్ చేసిందని ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి పటాన్ మహమ్మద్ అలీఖాన్ విమర్శించారు. శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ భారతీయ జనతా పార్టీకి కేంద్ర ఎన్నికల కమిషన్ టూల్ కిట్‌గా మారినట్లు ఎద్దేవా చేశారు. కేంద్ర ఎన్నికల సంఘం భారత రాజ్యాంగం నిర్దేశించిన విధుల నుండి చాలా కాలం కిందట నిష్క్రమించిందన్నారు. సర్వసాధారణంగా హర్యానా, మహారాష్ట్ర ఎన్నికల తర్వాత కేవలం ఇవిఎంలను భారతీయ జనతా పార్టీకి ఓట్లు నమోదయ్యే యంత్రాలుగా మంత్రాంగం నిర్వహించారని విమర్శించారు. దేశంలో రైతులు నెలల తరబడి చేస్తున్న దీక్షలు, భారతదేశ భూభాగాన్ని చైనా దేశం నిరంతరాయంగా ఆక్రమించడం, రూపాయి పతనం, ఆర్థిక వ్యవస్థ కుదేలు కావడం, నిరుద్యోగతాండవం, బీహార్ , ఉత్తరప్రదేశ్, హర్యానా, మధ్యప్రదేశ్ రాజస్థాన్ రాష్ట్రాల్లో నిరుద్యోగ యువకులు చేస్తున్న నిరసనలపై పోలీసులు అమానుషంగా దాడి చేస్తూ వారిని చావు దెబ్బలు తీయడం వంటి అధ్వాన పరిస్థితులలో కూడా ప్రజలు బిజెపికి ఓట్లు వేస్తున్నారని అనుకోవడం సిగ్గుచేటు అన్నారు. ప్రజలు భారతదేశాన్ని, రాజ్యాంగాన్ని కాపాడుకోవడానికి మరోసారి ఉద్యమించాల్సిన తరుణం ఆసన్నమైందని పిలుపునిచ్చారు. దేశాన్ని పూర్తిగా ధ్వంసం చేస్తున్న బిజెపి , ఆర్ఎస్ఎస్‌లకు బానిసగా మారిన కేంద్ర ఎన్నికల సంఘంపై ప్రజా ఉద్యమం నిర్వహించాలని మరోసారి పునరుద్ఘాటించారు.



ఆస్పత్రిని ప్రారంభిస్తున్న అవ్వారు మల్లికార్జున దంపతులు

అత్యాధునిక సౌకర్యాలతో అర్జున్ హాస్పిటల్ ప్రారంభం

ప్రజాశక్తి-కడప అర్బన్

అత్యాధునిక సౌకర్యాలతో అర్జున్ హాస్పిటల్ ప్రారంభించామని డాక్టర్ అర్జున్ కుమార్ అవ్వారు, డాక్టర్ శిరీష రేటాల తెలిపారు. శనివారం డాక్టర్ అవ్వారు అర్జున్ కుమార్ తల్లిదండ్రులు అవ్వారు మల్లికార్జున, ఎం.రమాదేవి ఆసుపత్రిని రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ అర్జున్ కుమార్, డాక్టర్ శిరీష మీడియాతో మాట్లాడుతూ ఆస్పత్రిలో జనరల్ మెడిసిన్, క్రిటికల్ కేర్, అత్యవసర కేసులు, డెర్మటాలజీ, ఆర్థోపెటిక్, ప్రిడియారటిక్స్, జనరల్ సర్జన్, కాస్మోటిక్ గైనకాలజీ అనే నూతన విధానం తీసుకువచ్చామని చెప్పారు. పది పడకల ఐసియూ, 50 పడకల సూట్ రూమ్స్, ప్రీమియర్ సౌకర్యాలు ఉన్నాయని పేర్కొన్నారు. 10 సంవత్సరాలుగా అవ్వారు ఆసుపత్రి తరపున సేవలు అందిస్తూ ఉన్నామని తెలిపారు. సొంత భవనంలో 50 పడగల ఆసుపత్రిని ఏర్పాటు చేశామని చెప్పారు. 24/7 అత్యవసర కేసులు చూస్తామని పేర్కొన్నారు. జనరల్ మెడిసిన్, గైనకాలజీ విభాగంలో సేవలు అందిస్తున్నామని తెలిపారు. ఇన్ పేషంట్, ఐసియూ, ఆపరేషన్ సౌకర్యాలతో కలిపి 50 పడకల ఆసుపత్రిని అభివృద్ధిలోకి తీసుకువచ్చామని చెప్పారు. ఆరు సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. రాయలసీమలోనే మొదటిసారి ఆత్యాధునిక సౌకర్యాలతో ఆసుపత్రిని నిర్మించామని తెలిపారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

భారతదేశ న్యాయ వ్యవస్థ ఎంతో దృఢమైంది

- సుప్రీం కోర్టు న్యాయమూర్తి జస్టిస్ సరసా వెంకటనారాయణ భట్టి
- మదనపల్లిలో అడిషనల్ సివిల్ జడ్జి కోర్టు ప్రారంభం

ప్రజాశక్తి- మదనపల్లె అర్బన్



కోర్టు శిలాఫకం ఆవిష్కరణలో న్యాయమూర్తులు

భారతదేశ న్యాయవ్యవస్థ ఎంతో దృఢమైందని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సరసా వెంకటనారాయణ భట్టి పేర్కొన్నారు. శనివారం మదనపల్లిలోని కోర్టు సముదాయంలో నూతనంగా నిర్మించిన అడిషనల్ సివిల్‌జడ్జి (సీనియర్ డివిజన్)కోర్టు భవన ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కార్యక్రమాన్ని మదనపల్లె బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సుప్రీం కోర్టు న్యాయమూర్తి మాట్లాడుతూ దేశచరిత్రలో మదనపల్లి పట్టణానికి ప్రత్యేక గుర్తింపు ఉందని, విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్ జాతీయ గీతం జనగణమనను ప్రసిద్ధిగాంచిన బి.టి.కళాశాలలో బెంగాలీ నుంచి ఆంగ్లంలోకి తర్జుమా చేశారని గుర్తుచేశారు. భారత రాజ్యాంగం 470 ఆర్టికల్స్, 106 రాజ్యాంగ సవరణ చట్టాలు కలిగి ఉందన్నారు. వీటికి న్యాయవ్యవస్థతో సంబంధం ఉందనారు. ముఖ్యంగా ఆర్టికల్ 14 దేశ పౌరుల సమానత్వాన్ని తెలియజేస్తుందని తెలిపారు. సుప్రీంకోర్టు సర్వోన్నతమైందన్నారు. దేశ న్యాయవ్యవస్థకు సంబంధించి సర్వహక్కులు సుప్రీం కోర్టుకు ఉంటాయన్నారు. దేశంలోని హైకోర్టులు, జిల్లా కోర్టులు సుప్రీం కోర్టు ఆదేశానుసారం పనిచేస్తాయని అన్నారు. న్యాయవ్యవస్థపై దేశ ప్రజలకు మరింత నమ్మకం పెంచాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఇది జరగాలంటే కేసులను త్వరితగతిన పరిష్కరించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. గతంలో ఎంతోమంది ప్రధాన న్యాయమూర్తులు సుప్రీంకోర్టు ఔన్నత్యాన్ని పెంపొందించారని తెలిపారు. అదే స్ఫూర్తితో ప్రస్తుత ప్రధాన న్యాయమూర్తులు పనిచేయడం దేశ న్యాయవ్యవస్థకు గర్వకారణమని అన్నారు. భారత రాజ్యాంగం, న్యాయవ్యవస్థ పరస్పర సహకారంతో దేశప్రతిష్ట పెంచుతున్నాయని కితాబిచ్చారు. ముఖ్యంగా మదనపల్లెలో తన చిన్ననాటి జ్ఞాపకాలు, విద్యాభ్యాసం, కళాశాల, లాయర్‌గా ప్రాక్టీస్, తన గురువులు అందించిన ప్రోత్సాహాన్ని సుప్రీంకోర్టు న్యాయ మూర్తి జస్టిస్ సరసా వెంకటనారాయణ భట్టి గుర్తు చేశారు. అనంతరం హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ మాట్లాడుతూ మదనపల్లెకు ఎంతో ఘన చరిత్ర ఉందని, ఈ ప్రాంతానికి రావడం తనకు ఎంతో గర్వకారణంగా ఉందన్నారు. మదనపల్లి కోర్టు సముదాయంలో ఉన్న మేజిస్ట్రేట్ కోని భవనం పూర్వం ఎంతో నైపుణ్యంగా రాతి కట్టడంతో కట్టారని, ఆ భవనాన్ని యథా స్థితిలో ఉంచి, భవనం పైనే మరో కొత్త భవనం ఏర్పాటు చేసి ఇస్తామని తెలిపారు. ఇక్కడి ప్రజలు ఎంతో ఆప్యాయంగా తమకు స్వాగతం పలికారని, కుటుంబ సమేతంగా ఇక్కడికి రావడం చాలా సంతోషంగా ఉందన్నారు. విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్ ఇక్కడే జనగణమన ఆలపించడం, జిడ్డుకృష్ణమూర్తి ఈ ప్రాంతవాసి కావడం, బిటి కళాశాల ఉండడం, ఇంత ఘన చరిత్ర ఉన్న మదనపల్లెలో కోర్టు భవనం ప్రారంభించడం జ్ఞాపకంగా ఉంటు ందన్నారు. ప్రశాంతతకు మారుపేరైన మదనపల్లెకు న్యాయపరమైన ఎలాంటి అవసరాలు కచిచ్చితంగా పరిష్కరిస్తానని తెలిపారు. కార్యక్రమంలో హైకోర్టు జడ్జిలు జస్టిస్ బి.కృష్ణమోహన్, జస్టిస్ టిసిడి శేఖర్ , బార్ అసోసియేషన్ అధ్యక్షులు తొట్లి వెంకటర మణారెడ్డి, చిత్తూరు ప్రిన్సిపల్ డిస్ట్రిక్ జడ్జి భీమారావు, బార్ అసోసియేషన్ సభ్యులు సుప్రీంకోర్టు న్యాయమూర్తి, ఎపి హైకోర్టు ప్రధాన న్యాయమూర్తులకు ఘనస్వాగతం పలికారు. కార్యక్రమంలో రెండవ అదనపు జిల్లా జడ్జి జస్టిస్ అబ్రహామ్, ఇతర కోర్టుల న్యాయమూర్తులు వెంకటేశ్వర్ నాయక్, సిరీష్, విజయకుమార్ రెడ్డి, జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, సబ్ కలెక్టర్ మేఘుస్వరూప్, అడిషినల్ ఎస్‌పి వెంకటాద్రి, తహాశీల్దార్ ధనుంజయులు, సిఐలు సత్యనారాయణ, కళా వెంకటరమణ, ఎరిషా వల్లి, రామచంద్ర, ఎస్ఐలు పాల్గొన్నారు.

తెలుగువారి గొప్పతనాన్ని ప్రపంచానికి చాటాలి

ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘం పూర్వ అధ్యక్షులు మండలి బుద్ధప్రసాద్



కార్యక్రమంలో మాట్లాడుతున్న మండలి బుద్ధ ప్రసాద్

ప్రజాశక్తి- కడప అర్బన్

రచయితలు నిజాయితీతో, నిర్భీతితో సామాజిక వాస్తవాలను ఎలుగెత్తి చాటాలని, అప్పుడే ఆ సాహిత్యం దర్పణంగా నిలుస్తుందని, సమాజంలో మార్పులు తెస్తుందని అవనిగడ్డ శాసన సభ్యులు, ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘం పూర్వ అధ్యక్షులు మండలి బుద్ధప్రసాద్ అన్నారు. శనివారం ఐఎంఎ హాల్లో వైఎస్ఆర్ జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో 'వెయ్యేళ్ల తెలుగు సాహిత్యం - రాయలసీమ భాగస్వామ్యం' అనే శీర్షికతో 2వ సాహిత్య, సాంస్కృతిక మహాసభలు 'సాహితీ సమరాంగణ సార్వభౌమ' శ్రీకృష్ణదేవరాయుల సభావేదికపై నిర్వహించారు. ప్రారంభ సభకు ముఖ్య అతిథిగా హాజరైన మండలి బుద్ధప్రసాద్ మాట్లాడుతూ తొలి తెలుగు శాసనం పుట్టిన గడప రాయలసీమని, రాయలసీమవాసులు మరింత చైతన్యవంతులై భాషను సజీవంగా నిలిపేందుకు కృషి చేయాలన్నారు. జిల్లాలో 1970లలో కడప జిల్లా రచయితల సంఘం విస్తృతంగా మహాసభలను నిర్వహించి రాష్ట్ర స్థాయిలో ప్రముఖులైన అనేకమంది కవులు, రచయితలను ఆహ్వానించి విజయవంతంగా నిర్వహించారని పేర్కొన్నారు. ఆ స్ఫూర్తితోనే తాముకూడా కృష్ణా జిల్లా రచయితల సంఘం నెలకొల్పి విస్తృతంగా రాష్ట్ర స్థాయి కార్యక్రమాలు, ప్రపంచ తెలుగు మహాసభలు నిర్వహిస్తున్నామన్నారు. 32వేల సంకీర్తనలు రచించినవాడు మన తెలుగువాడైన తాళ్లపాక అన్నమయ్య ఒక్కడేనని, కానీ ఆవిషయాన్ని మనం ప్రపంచానికి తెలిసేలా చాటి చెప్పుకోలేకపోతున్నామని అసంతృప్తిని వ్యక్తం చేశారు. సభాధ్యక్షులు, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం విసి ఆచార్య వెలుదండ నిత్యానందరావు మాట్లాడుతూ రచయితలు ధైర్యంగా సమాజంలో ఉన్నటువంటి లోపాలను ఎత్తిచూపేలా రచనలు చేయాలన్నారు. స్వాతంత్ర్య సంగ్రామంలో ప్రజలను చైతన్యం పరిచేలా తొలి చారిత్రక మహాకావ్యం రాయలసీమ గడ్డపైనే పుట్టిందన్నారు. ఆత్మీయ అతిథి, ప్రసిద్ధ చలన చిత్ర నటుడు శివకృష్ణ మాట్లాడుతూ కవులకు, కళాకారులకు రాయలసీమ పెట్టింది పేరన్నారు. కవులు, రచయితలు బాగుంటేనే దేశం సుభిక్షంగా ఉంటుందన్నారు. విశిష్ట అతిథి, శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం విశ్రాంత ఆచార్యులు శలాక రఘునాథశర్మ మాట్లాడుతూ తెలుగు భాష అమృతం వంటిదని, ఇతర ఏ భాషలో లేనటువంటి నడక తెలుగు పద్యానికి ఉందన్నారు. జిల్లా రచయితల సంఘం జిల్లా గౌరవాధ్యక్షులు, మరో ఆత్మీయ అతిథి షేక్ హుసేన్ సత్యాగ్ని మాట్లాడుతూ శివతాండవం వెలుగు చూసి గడ్డ రాయలసీమ అంటూ శివతాండవం గేయాన్ని ఆలపించి సభను ఉత్తేజపరిచారు. గౌరవ అతిథి, వైఎస్సార్ జిల్లా రచయితల సంఘం ఉపాధ్యక్షులు విద్వాన్ గానుగపెంట హనుమంతరావు మాట్లాడుతూ రాయలసీమ కరవు కాటకాలకు నిలయమైనా సాహిత్య సృష్టికి కొరతలేదన్నారు. మరో గౌరవ అతిథి, వైఎస్సార్ జిల్లా రచయితల సంఘం జిల్లా గౌరవ సలహాదారులు అలపర్తి పిచ్చయ్య చౌదరి మాట్లాడుతూ కవిత్వం అనేది సమాజ హితాన్ని కాంక్షించేలా ఉండాలన్నారు. సంఘం ప్రధాన కార్యదర్శి జింకా సుబ్రహ్మణ్యం నివేదిక సమర్పిస్తూ గతేడాది నిర్వహించిన జిల్లా రచయితల సంఘం జిల్లా మహాసభలు విజయవంతంగా నిర్వహించామని, నేడు రాయలసీమ సాహిత్య సభలు నిర్వహిస్తూ మరో అడుగు ముందుకు వేశామన్నారు. ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి రచించిన శ్రీ శివ భక్తేంద్ర స్వామి, రామాయణ, భారత, భాగవతాల్లో కొన్ని పాత్రలు, జార్జిజ్యోతి రచించిన 'అగంతకుడు', మందల సుభాష్ చంద్రబోస్ రచించిన 'సుమశతకం', బుద్ధశతకం, పసలోడిపద్యాలు, మశక త్యాగం, ప్రేమ యోగం, డా. తమ్మిశెట్టి వెంకటనారాయణ రచించిన శ్రామిక కథలు - స్త్రీ చైతన్యం, డా. వి. సలీంబాష రచించిన 'సమీచీనం', మా ఏవీఎస్రాజు అభినందన సంచిక, గద్వాల సోమన్న రచించిన హృదయరాగాలు అనే పుస్తకాలను అతిథులు ఆవిష్కరించి రచయితలను సత్కరించారు.

ఉర్దూ స్కూళ్లపై కక్షసాధింపు తగదు

- కడప మైనార్టీ నాయకుల ఆగ్రహం

ప్రజాశక్తి - కడప

రాష్ట్రంలో రెండవ అధికార భాషగా ఉన్న ఉర్దూ భాషను వాట్సాప్ గవర్నెన్స్‌లో పెట్టకపోవడం కూటమి ప్రభుత్వ కుటిల నీతిని బయట పెడుతుందని కడప మైనార్టీ నాయకులు, 30వ డివిజన్ కార్పొరేటర్ నగర మైనారిటీ అధ్యక్షులు, మహమ్మద్ షఫీ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉర్దూ స్కూళ్లపై కూటమి ప్రభుత్వం కక్ష సాధింపు గా వ్యవహరిస్తుందని అన్నారు. శనివారం మాజీ ఉప ముఖ్యమంత్రి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మైనార్టీ నాయకులు మాట్లాడారు. కడప నగరంలో ప్రాథమిక పాఠశాలలు13, యుపిఎస్ పాఠశాలలు ఐదు, ఐదు హైస్కూళ్లు నాలుగు ఉన్నాయి అన్నారు. ఈ స్కూలును కూడా వేరే స్కూల్లో కలపడానికి ప్రయత్నాలు చేయడం సబబు కాదు అన్నారు. కడప జిల్లాలో ప్రాథమిక స్కూల్ 101 ప్రాథమిక ఉన్నత స్కూల్లో 30 ఉన్నత స్కూల్లో 25 మొత్తం కలిపి 156 ఉర్దూ స్కూళున్నాయని తెలిపారు. ముస్లిమ్ మైనార్టీల మాతృభాష ఉర్దూను ఊపిరి తీయడానికి కూటమి ప్రభుత్వం కుట్ర చేస్తుందన్నారు. విద్యార్థులు తక్కువగా ఉన్నారన్న సాకుతో స్కూళ్లను మూసివేసి వేరే స్కూల్లో విలీనం చేసి, అప్పటికే ఉన్న ఉర్దూ స్కూళ్లను మూసివేసే కుట్ర చేస్తుందన్నారు. దీంతో రాష్ట్రంలో 1390 ఉర్దూ పాఠశాలల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారింది అన్నారు. జీవో నెంబర్ 117 ను రద్దుచేసి కొత్త జీవో తీసుకువచ్చి మైనారిటీల ఉర్దూ భాష పైన వేటు వేసేందుకు ప్రయత్నం చేస్తుంది అన్నారు. రెండవ అధికార భాషగా ఉర్దూను స్థానం కల్పించిన ఘనత అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డికి దక్కుతుంది అన్నారు. బిజెపి, జనసేన, తెలుగుదేశం కూటమి ప్రభుత్వం అందుకు విరుద్ధంగా ముస్లిం మైనార్టీల మీద కక్ష సాధింపు ధరణితో ముందుకు పోవడం తగదన్నారు. సమావేశంలో నార్త్ జోన్ అధ్యక్షులు బి.హెచ్. ఇలియాస్, నగర మైనారిటీ అధికార ప్రతినిధి, డి.జి.అక్బర్ అలి, నగర మైనారిటీ ఉపాధ్యక్షులు అథాఉల్లాహ్, మాజీ రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ మెంబర్ జఫరుల్లాహ్, 31వ డివిజన్ కార్పొరేటర్ అజ్మతుల్లాహ్ ఖాన్మహమ్మద్ అబ్దుల్లా,సాయి హుస్సేన్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మహమ్మద్ షఫీ

మొక్కుబడి

ప్రజాదృష్టి

ఇటీవలి డిఆర్‌సి, జడ్‌పి సమావేశాలు మొక్కుబడిని తలపించాయి. జిల్లా డెవలప్‌మెంట్ రివ్యూ మీటింగ్ జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి సవిత సమక్షంలో కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా తలసరి ఆదాయం పెంపు, డిపార్టుమెంట్ల వారీగా 15 నుంచి 18 శాతం అభివృద్ధిని సాధిస్తామని ప్రగల్భాలు చెప్పుకోవడానికి ఉపకరిస్తుందనడంలో సందేహంలేదు. ఇందుకు 2020 లక్ష్యాలే చక్కటి ఉదాహరణ. ప్రతిఏటా పెరుగుతున్న ధరలు, మారుతున్న కాలానికి అనుగుణంగా 15 శాతం వృద్ధిని లక్షించడం కద్దు. కానీ 18 శాతానికిపైగా సాధిస్తేనే నిజమైన వృద్ధిగా చెప్పుకోవచ్చు. కానీ ఆచరణలో ఇటువంటి అవకాశాలు కలిగిన డిపార్టుమెంట్లను గుర్తించాలి. అటువంటి విభాగాలకు సమర్థులైన అధికారులను నియమించాలి. అటువంటి విభాగాల పట్ల ప్రత్యేక చొరవ చూపించాలి. ప్రత్యేక రోడ్‌మ్యాప్ లేకుండా మొక్కుబడి లక్ష్యాలను ప్రకటించు కోవడం ప్రజల్ని మోసగించడమే అవుతుందని గమనించాలి. విజనరీ ఉండాల్సిందే, కాని ఫలితాల సాధన పట్ల చిత్తశుద్ధి ఉండాలి. ఇటువంటి తరహాలోనే వరుసగా జడ్‌పి స్టాండింగ్ కమిటీ సమావేశాల దగ్గర నుంచి జడ్పీ సర్వసభ్య సమావేశాల వరకు మొక్కుబడిని తల పించడం గమనార్హం. ఇటువంటి తరహా కార్యక్రమాల నిర్వహణ ద్వారా ఉదాత్తమైన ఆశయాలను ఎలా సాధిస్తారో ఆలోచన చేయాలి. జిల్లా పరిషత్ సిఇఒకు సమావేశాల నిర్వహణ పట్ల అవగాహన కొరవడిన ఫలితమా, లేక రాజకీయ నాయకుల్లో చిత్తశుద్ధి లోపమా అనేది తేలాల్సి ఉంది. ఒక మహిళా ఉన్నతాధికారికి జిల్లా రాజకీయ నాయకత్వం సహకారం అందించాలి. కానీ గత స్టాండింగ్ కమిటీ సమావేశంలో కోరమ్ లేకపోవడంతో గంటల తరబడి వేచి చూడాల్సి రావడం, తాజా జడ్‌పి సర్వసభ్య సమావేశం నిర్వహణకు కలెక్టర్, జాయింట్ కలెక్టర్లు గైర్హాజరైన నేపథ్యాన్ని పరిశీలిస్తే కార్యనిర్వాహక వర్గమైన జిల్లా అధికార యంత్రాంగం, శాసన నిర్వహణ నాయకత్వ లోపమూ ఉందనేది నిష్ఠుర సత్యం. ఢిల్లీ నుంచి పార్లమెంట్ సభ్యులు వైస్ అవినాష్‌రెడ్డి సర్వసభ్య సమావేశానికి వస్తే, జిల్లాలోనే ఉంటున్న కలెక్టర్ చెరుకూరి శ్రీధర్, జాయింట్ కలెక్టర్ అతిదీసింగ్ హాజరు గాకపోవడం ఏమిటో ఆలోచించుకోవాలి. ఇది జిల్లా పరిషత్ పాలక వర్గానికి అవమానం అనుకోవాలా, జిల్లా రాజకీయ నాయకత్వానికి అవమానం అనుకోవాలో తెలియడం లేదు. లేక కూటమి తరుపున ప్రజాప్రతినిధులు గైర్హాజరు సమాచారాన్ని తెలుసుకుని ఉద్దేశపూర్వ కంగానే నిర్లక్ష్యం చేశారా అనేది తెలియడం లేదు. నిజంగానే జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశానికి కంటే మించిన కార్యక్రమం ఉంటే జిల్లా సర్వోన్నతాధికారి తాత్కాలికంగా గంట పాటైన హాజరై, వెళ్లి పో యి ఉండాల్సి ఉంది. ఇటువంటి పరిస్థితుల నేపథ్యంలో వైసిపి నాయకత్వం జిల్లా సర్వోన్నతాధికారి లేకుండా సమస్యలు ఎవరికి చెప్పాలి, ఎలా పరిష్కారం అవుతాయో చెప్పాలని సిఇఒను నిలదీయ డం సబబే. కానీ కూటమి ప్రజాప్రతినిధులు హాజరైన సమావేశాల్లో ఇటువంటి తరహాలో హుందాతనాన్ని ప్రదర్శించాలి. అప్పుడు మాత్రమే ఉమ్మడి జిల్లా ప్రజల సమస్యల పట్ల లోతైన చర్చ జరగడంతో పాటు సమర్థవంతమైన పరిష్కారం లభించేదనడంలో సందేహం లేదు.

ప్రజాశక్తి - కడప ప్రతినిధి



సిఎం సహాయనిధి చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే 'పుట్టా'

పేదలకు అండగా ప్రభుత్వం

ప్రజాశక్తి - చాపాడు

ప్రభుత్వం పేదలను అన్ని విధాలా ఆదుకుంటుందని ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ పేర్కొన్నారు. టిడిపి కార్యాలయంలో శనివారం మైదుకూరు నియోజకవర్గ పరిధిలో సిఎం సహాయక నిధి కింద 38 మంది బాధితులకు రూ.69.47లక్షల చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఎన్టీఆర్ ఆరోగ్య శ్రీ పథకం ద్వారా అన్ని రకాల సేవలకు ఉచితంగా వైద్యం అందిస్తుందన్నారు. పథకం ద్వారా వైద్య సేవలు అందని వారు ఎవరైనా ఉంటే "వారు ఆసుపత్రి ఖర్చులు నష్టపోకుండా సిఎం రిలీఫ్ ఫండ్ ద్వారా నిధులు మంజూరు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో టిడిపి మండల శాఖ అధ్యక్షుడు అన్నవరం సుధాకర్‌రెడ్డి, మాజీ డిసిఎంఎస్ వైస్ చైర్మన్ పాలగిరి వేమారెడ్డి, ఖాజీపేట మండల శాఖ అధ్యక్షుడు టి.లక్ష్మిరెడ్డి పాల్గొన్నారు.



కుప్పాలపల్లె గంగమ్మ ఆలయంలో ఎంపీ, స్థానికులు

గంగమ్మ ఆలయంలో విగ్రహ ప్రతిష్టాపన

ప్రజాశక్తి - వేంపల్లె

మండలంలోని కుప్పాలపల్లె గ్రామంలో నూతనంగా నిర్మించిన తాళ్లపల్లె గంగమ్మ ఆలయంలో శనివారం ఘనంగా విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం నిర్వహించారు. కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి కార్యక్రమంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయాన్ని వైసిపి నేత బంక సోమేశ్వరరెడ్డి నిర్మించారు. మూడు రోజులు నుంచి ఆలయంలో ఆయా కార్యక్రమాలను గ్రామస్తులు నిర్వహించారు. ఎంపీని ఆలయ నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో జడ్‌పిటిసి రవికుమార్ రెడ్డి, వైసిపి నాయకులు బంక సోమేశ్వరరెడ్డి, ప్రసాద్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, రామగంగిరెడ్డి, కొత్తూరు రెడ్డయ్య, కుప్పాలపల్లె సర్పంచ్ లక్ష్మిదేవి, బంక వేణుగోపాల్‌రెడ్డి, మధురెడ్డి, మారుతిరెడ్డి, నాగమునిరెడ్డి, సోమశేఖర్‌రెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

నక్కలదిన్నెలో..

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలోని నక్కలదిన్నె గ్రామంలో శనివారం సీతారామ సమేత హనుమాన్ విగ్రహ శిఖర ప్రతిష్ఠ కార్యక్రమాన్ని గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. మూడు రోజులుగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. శనివారం సీతారాముల కళ్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. కోలాటం, చెక్క భజన వంటి సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి కుటుంబ సభ్యులు, ప్రొద్దుటూరు మాజీ ఎమ్మెల్యే లింగారెడ్డి, రాజేశ్వర్‌రెడ్డి, సిఆర్‌డిఎ కమిషనర్ రామ్ సుందర్‌రెడ్డి, ఆలయ చైర్మన్ రాంప్రసాద్‌రెడ్డి, నిర్వాహకులు సివి సుబ్బారెడ్డి, రమేష్‌రెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, సిద్ధారెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.



సీతారాముల కల్యాణంలో పాల్గొన్న గ్రామస్తులు



విరాళం అందజేసిన దాతలు

నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం

చక్రాయపేట

ప్రముఖ పుణ్యక్షేత్రం గండి శ్రీవీరాంజనేయ స్వామి శాశ్వత నిత్యాన్నదాన పథకానికి పాలెంపల్లె గ్రామానికి చెందిన భక్తుడు మేకల హనుమంతయ్య కుమారుడు ఆంజనేయులు రూ.1,00,116 విరాళాన్ని అందజేశారని ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వెంకటసుబ్బయ్య తెలిపారు. వారికి ఆలయ ప్రధాన అర్చకులు కేసరి స్వామి ప్రత్యేక దర్శనం చేయించి, తీర్థ ప్రసాదాలు అందజేసి, శేష వస్త్రం, స్వామి వారి చిత్రపటాన్ని అందజేశారు. ఈ సందర్భంగా దాతలు మాట్లాడుతూ భక్తులకు నిత్యాన్నదానం ఏర్పాటు చేయడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. భీష్మ ఏకాదశి పుణ్యదినమున స్వామి దర్శనానికి అధిక సంఖ్యలో భక్తులు విచ్చేశారు. అన్నదాన విరాళాలు, ఇతర కార్యక్రమాల ద్వారా శనివారం ఒక్కరోజే రూ.4,62,096 ఆదాయం వచ్చినట్లు ఏసి తెలిపారు. కార్యక్రమంలో ఆలయ పాలకమండలి మాజీ చైర్మన్ కల్లూరు వెంకటస్వామి, అర్చకులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

మంత్రులకు ర్యాంకింగ్ అనేది సెల్ఫ్ గోల్

వేంపల్లె : కూటమి ప్రభుత్వం మంత్రులకు ర్యాంకింగ్ ఇవ్వడం అనేది సెల్ఫ్ గోల్ కొట్టుకోవడమేనని పిసిసి అధికార ప్రతినిధి తులసిరెడ్డి పేర్కొన్నారు. శనివారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ర్యాంకింగ్‌ను మంత్రులకు చెప్పాలే కానీ.. అలా కాకుండా టాంటాం చేయడం సమంజసం కాదన్నారు. ర్యాంకింగ్‌లో సిఎం చంద్రబాబుకు 6వ ర్యాంకు, లోకేష్‌కు 8వ ర్యాంకు, పవన్ కల్యాణ్‌కు 10వ ర్యాంకు రావడం ద్వారా ప్రజల్లో, కార్యకర్తల్లో మంత్రుల్లో వారి పట్ల చులకన భావం వచ్చిందని పేర్కొన్నారు. కృష్ణానది యాజమాన్య బోర్డు కార్యాలయాన్ని రాయలసీమలో ఏర్పాటు చేయాలని కోరారు. కృష్ణా బోర్డు కార్యాలయాన్ని విజయవాడలో కాకుండా రాయలసీమలో శ్రీశైలం జలాశయానికి సమీపంలో ఏర్పాటు చేయడం సమంజసమన్నారు. ఆ కోణంలో రాష్ట్ర ప్రభుత్వం ఆలోచించాలని తులసిరెడ్డి కోరారు.

క్రైం కార్నర్

మహిళ మృతిపై కేసు నమోదు

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలోని రాజుపాలెం గ్రామంలో జాకట వరలక్ష్మి (28) శనివారం మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. పోలీసులు అందించిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన జాకట శ్రీకాంత్ భార్య వరలక్ష్మి తెల్లవారుజామున ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. ఈ విషయాన్ని బంధువులకు తెలిపారు. అయితే ఎర్రగుంట్ల మండలం తిప్పలూరు గ్రామానికి చెందిన మృతురాలి అన్న ఓబుల్ కుమార్ తన చెల్లెలు మృతి పట్ల అనుమానం వ్యక్తం చేస్తూ ఫిర్యాదు చేశాడు. ఎస్ఐ చిన్న పెద్దయ్య వరలక్ష్మి భర్త శ్రీకాంత్, అతని తల్లి మరియమ్మపై అనుమానిత కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇంటి వద్దకు రాని ఎండియు వాహనం

ప్రతి నెలా రూ.1.60 లక్షలు బిల్లులు చెల్లింపు-చోద్యం చూస్తున్న రెవెన్యూ అధికారులు

ప్రజాశక్తి - సింహాద్రిపురం

గత ప్రభుత్వ హయాంలో రేషన్ కార్డు లబ్ధిదారులకు ఇంటి వద్దనే రేషన్ బియ్యం అందించాలనే లక్ష్యంతో ఎండియు (మొబైల్ డిస్పాచింగ్ యూనిట్) వాహనాలను ఏర్పాటు చేసింది. ఆ మేరకు వైసిపి హయాంలో అమలైంది. 2024సార్వత్రిక ఎన్నికల అనంతరం వైసిపి అధికారాన్ని కోల్పోయింది. టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఎండియు వాహనాలకు స్వస్తి పలుకుతారని ప్రజలు భావించారు. అయితే ప్రభుత్వం ప్రతి రేషన్ కార్డు దారుని ఇంటికి బియ్యం పంపిణీ చేసేలా ఆదేశాలు జారీ చేసింది. మండల వ్యాప్తంగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఎండియు వాహనాలు తిరగక పోయినప్పటికీ రెవెన్యూ అధికారులు బిల్లులు చేసినట్లు తెలిసింది. మండల వ్యాప్తంగా 32 రేషన్ దుకాణాలున్నాయి. వీటికి ప్రతినెలా 28,175 కిలోల బియ్యం, 4,695 కిలోల పంచదార, అదనంగా కందిపప్పు సరఫరా చేస్తున్నారు. వీటిని పంపిణీ చేయడానికి మండల వ్యాప్తంగా సింహాద్రిపురం రెండు, గురజాల, బిదినంచర్ల, అంకాలమ్మ గూడూరు, బలపనూరు, కసునూరు, పైడిపాలెం గ్రామాల్లో ఒకొక్కటి చొప్పున ఎండియు వాహనాలను ఏర్పాటు చేశారు. ఈ 8 ఎండియు వాహనదారులు మండలంలోని 32 రేషన్ షాప్‌ల పరిధిలో ప్రతి ఇంటికి వెళ్లి సరుకులు పంపిణీ చేయాల్సి ఉంది. ఇందుకు ప్రభుత్వం ఒక్కో ఎండియు వాహనదారునికి రూ.20 వేలు చెల్లిస్తున్నారు. ఈ ప్రకారం మండల వ్యాప్తంగా ప్రతినెల రూ 1.60 లక్షలు చెల్లింపు జరుగుతోంది. ఈ లెక్కన టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఎండియు వాహనాలకు దాదాపు రూ.10 లక్షలపైగా ప్రజాధనం చెల్లించినట్లు. ఎండియు వాహనదారుల లాగిన్‌లోనే ప్రస్తుత డీలర్లు బియ్యాన్ని పంపిణీ చేస్తున్నారు. దీంతో ఎండియు వాహనదారులకు అప్పనంగా ప్రతి నెల లక్షలాది రూపాయలు రెవెన్యూ అధికారులు చెల్లింపు పట్ల పలు విమర్శలు వినిపిస్తున్నాయి. ఎండియు వాహనం తిరగకపోయినప్పటికీ బిల్లులు చెల్లింపు పట్ల రెవెన్యూ శాఖ అధికారులు ఉదాసీనత ప్రదర్శించడానికి కారణాలు లేకపోలేదని పలు విమర్శలు వినిపిస్తున్నాయి.



వైసిపి పాలనలో ఏర్పాటు చేసిన ఎండియు వాహనం

ఇంటి వద్దకు వాహనం వెళ్లాల్సిందే..

ప్రభుత్వ నిబంధన ప్రకారం ప్రతి రేషన్ కార్డుదారుడి ఇంటి వద్దకు ఎండియు వాహనం వెళ్లి సరుకులు పంపిణీ చేయాలి. సింహాద్రిపురం మండలంలో ఎండియు వాహనాలు తిరగని విషయం మా దృష్టికి రాలేదు. వాహనం తిరగకుండా బిల్లులు చేసినట్లయితే అందుకు సంబంధించిన వారిపై తప్పనిసరిగా చర్యలు తీసుకుంటాం.


- చిన్నయ్య, ఆర్‌డిఒ, పులివెందుల

వందేళ్ల భారతీయ కథా సంకలనంలో

'ఒంటి చెయ్యి'కి స్థానం

ప్రజాశక్తి - వేంపల్లె

భారతదేశంలో గత వందేళ్లలో వచ్చిన వంద ఉత్తమ కథల సంకలనంలో జిల్లా వాసి వేంపల్లె షరీఫ్ రాసిన 'ఒంటి చెయ్యి' కథకు స్థానం దక్కింది. ముంబైలోని ప్రపంచ ప్రఖ్యాత పుస్తక ముద్రణా సంస్థ అలేఫ్ గత వందేళ్ల భారతీయ కథా సాహిత్యంలో వచ్చిన వంద ఎన్నదగిన కథలతో 100 భారతీయ కథాపేరుతో సంకలనాన్ని తీసుకొచ్చింది. కేరళ వాసి అయిన ప్రఖ్యాత కవి, అనువాదకుడు, కేంద్ర సాహిత్య అకాడమీ ది ఇండియా లిటరెట్ పత్రిక పూర్వ సంపాదకుడు ఎజె థామస్ ఈ సంకలనానికి సంపాదకత్వం వహించారు. ప్రపంచ ప్రఖ్యాత కథా రచయిత రస్కిన్ బాండ్ ముందు మాటతో ఈ పుస్తకాన్ని అలేఫ్ బుక్ కంపెనీ మార్కెట్లోకి విడుదల చేసింది. ప్రస్తుతం అమెజాన్‌లో అత్యధికంగా అమ్ముడుపోతున్న ఈ పుస్తకంలో ప్రపంచ ప్రసిద్ధ భారతీయ రచయితలైన రవీంద్రనాథ్ ఠాగూర్, ప్రేమ్ చంద్, శరత్ చంద్ర ఛటర్జీ, సుబ్రమణ్య భారతి, కెఎం మున్షీ, కువెంపు, ఆర్కే నారాయణ్, ఇస్మాత్ చుగ్తాయ్, కుష్వంత్ సింగ్, సత్యజిత్ రే, మహాశ్వేత దేవి, రస్కిన్ బాండ్, ప్రతిభారే, శశిథరూర్, వివేక్ శాన్ భాగ్, డేవిడ్ దేవిడర్, వైకం బషీర్ మొహమ్మద్ వంటి ఉద్దండుల కథలు ఉన్నాయి. వీరి సరసన తెలుగు నుంచి చలం, కవన శర్మ, సయ్యద్ సలీం, తురగా జానకీ రాణి, వేంపల్లె షరీఫ్ కథలకు స్థానం కల్పించారు. షరీఫ్ 2015లో రాసిన 'ఒంటి చెయ్యి' కథను బెంగ ళూరుకు చెందిన ప్రముఖ అనువాదకుడు ఎన్ఎస్ మూర్తి సిరిప్రిలిడ్ వరల్డ్ పేరుతో ఆంగ్లంలోకి అను వాదం చేశారు. ప్రస్తుతం ఆ కథకు ఇంతటి గౌరవం దక్కడం పట్ల షరీఫ్ హర్షం వ్యక్తం చేశారు. తెలుగు కథ.. అందులోనూ రాయలసీమ కథ ఎందులోనూ తక్కువ కాదన్నారు. రాయలసీమ నుంచి గొప్ప రచయితలు ఉన్నారని, వాళ్ల కథలకు కూడా భవిష్యత్తులో ఇలాంటి సంకలనాల్లో స్థానం ఉండాలని కోరుకుంటున్నట్లు చెప్పారు.



ఆప్కాస్ రద్దు చేస్తే కార్మికులను పర్మినెంట్ చేయాలి



మాట్లాడుతున్న సిఐటియు నాయకులు

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

కూటమి ప్రభుత్వం ఆప్కాస్ రద్దు చేస్తే కార్మికులందరిని పర్మినెంట్ చేయాలని జమ్మలమడుగు సిఐటియు అధ్యక్ష, కార్యదర్శులు దాసరి విజయ్, జి.ఏసుదాసు డిమాండ్ చేశారు. ఆ మేరకు స్థానికంగా శనివారం వారు మాట్లాడుతూ పొరుగు సేవల కార్మికుల కోసం గత వైసిపి ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఆప్కాస్‌ను రద్దు చేయాలని గురువారం జరిగిన మంత్రివర్గం తీర్మానిస్తున్నట్లు పత్రికల్లో వచ్చిందన్నారు. ఈ నేపథ్యంలో ఆప్కాస్‌లో ఉన్న పొరుగు సేవల కార్మికులందరిలోనూ తీవ్ర భయాందోళన నెలకొందన్నారు. ఆప్కాస్‌ను రద్దు చేస్తే మళ్లీ దళారీ వ్యవస్థ రంగంలోకి వస్తుందన్నారు. ఉద్యోగాలకు భద్రత లేకుండా పోయే ప్రమాదం ఏర్పడిందన్నారు. పొరుగు సేవల కార్మికుల్లో నెలకొన్న భయాందోళనలను తొలగించి ఉద్యోగ భద్రత, భరోసా కల్పించేలా కూటమి ప్రభుత్వం వెంటనే స్పందించాలని ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సిఐటియు) జమ్మలమడుగు కమిటీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తోందన్నారు. ఆప్కాస్ ఏర్పాటు కాకముందు మున్సిపాలిటీ రంగంలో ప్రతి సెక్షన్‌కు దళారీ వ్యవస్థ కొనసాగేదన్నారు. జీతభత్యాల చెల్లింపు దళారీల దయాదాక్షిణ్యాల మీద ఆధారపడి ఉండేదన్నారు. కూటమి ప్రభుత్వం పునరాలోచన చేయాలని కోరారు. కార్యక్రమంలో మైఖేల్, కరిముల్లా, వినోద్ పాల్గొన్నారు.



విజేతలతో కళాశాల సిబ్బంది

క్రీడల్లో ఉద్యాన విశ్వవిద్యాలయ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

ఉద్యాన కళావేదికగా జరిగిన క్రీడా పోటీల్లో పులివెందులకు చెందిన డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయ ఇంటర్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. 11వ ఇంటర్ కళాశాల కాంపిటీషన్ పోటీలు అన్నమయ్య జిల్లా అనంతరాజుపేట ఉద్యాన కళాశాల వేదికగా ఈనెల 4 నుంచి 7వతేదీ వరకు నిర్వహించారు. ఈ పోటీల్లో జానపద గీతంలో ప్రథమ స్థానం, జానపద నృత్యంలో రెండో స్థానం, ఉపన్యాసంలో, కబడ్డీలో మూడో స్థానం పులివెందుల విద్యార్థులు కైవసం చేసుకున్నారు. కబడ్డీ విభాగంలో ముగ్గురు విద్యార్థులు జాతీయ స్థాయికి ఎంపికయ్యారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు కళాశాల అసోసియేషన్ డీన్ నాగరాజు, అసోసియేషన్ ప్రొఫెసర్ రామాంజనేయరెడ్డి, కళాశాల అధ్యాపకులు అభినందనలు తెలిపారు.



మాట్లాడుతున్న బ్రహ్మాం చెల్లెలు శివలక్ష్మి

'మా అన్న మృతిపై అనుమానాలు ఉన్నాయి'

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

ఇటుకల బట్టీ వద్ద మృతి చెందిన తమ అన్న బ్రహ్మాం మరణంపై అనుమా నాలు ఉన్నాయని ఆయన చెల్లెలు శివలక్ష్మి పేర్కొన్నారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఆమె విలేకరులతో సమా వేశంలో మాట్లాడుతూ ఇటుకల బట్టి యజమాని బెంగళూరు శ్రీని వాసులురెడ్డి, మా అన్న భార్య నాగలక్ష్మిని పోలీసులు విచారించాలని, వారిపై తమకు అనుమానం ఉందన్నారు. ఉరేసుకుని చనిపోతే పోలీసులకు తెలిపి వారు వచ్చేవరకు మృతదేహాన్ని అక్కడ ఎందుకు ఉంచలేదని ప్రశ్నించారు. తమ అన్న ఆత్మహత్య చేసుకున్నట్లు ఆనవాళ్లేవి లేవన్నారు. బ్రహ్మంను కొట్టి చంపారని, మృతదేహంపై ఉన్న గాయాలే చెబుతున్నాయన్నారు. రూరల్ పోలీసులు తమకు న్యాయం చేస్తారనే నమ్మకం లేదని, అందుకే డిఎస్‌పి ఫిర్యాదు చేశామన్నారు. ఈ విషయమై ఆదివారం ఎస్‌పిని కూడా కలుస్తామన్నారు. సమావేశంలో బ్రహ్మం తల్లి, బంధువులు పాల్గొన్నారు.

బాల్ బ్యాడ్మింటన్‌లో ఎస్‌పి కళాశాల విజయకేతనం

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో స్థానిక సాయి పరమేశ్వర డిగ్రీ కళాశాల విద్యార్థులు యూనివర్సిటీ స్థాయిలో మొదటి స్థానంలో విజయకేతనం ఎగరవేశారని ఆ కళాశాల కరస్పాండెంట్ పాల నాగేశ్వరరెడ్డి తెలిపారు. శనివారం జమ్మలమడుగులో ఆయన మాట్లాడుతూ యూనివర్సిటీ స్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలు కమలాపురంలోని సిఎస్ఎస్ఆర్, ఎస్ఆర్ఆర్ఎం డిగ్రీ కళాశాలలో జరిగాయన్నారు. ఈ పోటీల్లో జిల్లా స్థాయిలో తమ కళాశాల విద్యార్థులు మొదటి స్థానంలో నిలవడం యూనివర్సిటీ ప్రిన్సిపల్ రఘురామిరెడ్డి, యూనివర్సిటీ స్పోర్ట్స్ డైరెక్టర్ రామ సుబ్బారెడ్డిచే మెడల్స్, సర్టిఫికెట్, టోర్నమెంట్ ట్రోఫీతోపాటు రూ.5000 నగదు బహుమతిని అందుకున్నారని తెలిపారు. చదువుతోపాటు క్రీడల్లో మరింత రాణిస్తే మంచి అవకాశాలు వస్తాయని, విద్యార్థులు వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. విజేతలను అభినందించారు. కార్యక్రమంలో టీం మేనేజర్ ఎన్‌సీసీ ఆఫీసర్ లెఫ్టినెంట్ రాజు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



మెమోంటో, సర్టిఫికెట్లతో విజేతలు

పింఛన్ల ఏరివేతకు మరోమారు శ్రీకారం

11,12వ తేదీల్లో పునఃపరిశీలన-లబ్ధిదారులకు నోటీసులు జారీ

ప్రజాశక్తి - సింహాద్రిపురం

మండల వ్యాప్తంగా విభిన్నప్రతిభావంతుల పింఛన్ల ఏరివేతకు కూటమి ప్రభుత్వం మరోమారు శ్రీకారం చుట్టింది. గత నెలలో రూ.15 వేలు పెన్షన్ పొందుతున్న నరాల బలహీనత, పక్షవాతంతో మంచానికే పరిమితమైన 35 మందిని ప్రత్యేక వైద్య బృందాలు పరిశీలించాయి. మండల వ్యాప్తంగా 5,420 మంది ఎన్టీఆర్ సామాజిక పింఛన్లను పొందుతున్నారు. ఈనెల 11, 12 తేదీల్లో పునఃపరిశీలన చేయనున్నారు. మండల వ్యాప్తంగా 820 మంది చెవి, ఎముకలు, కంటి చూపులోపం సంబంధించి నెలకు రూ.6 వేలు పెన్షన్ పొందుతున్నారు. వీరిలో ఎక్కువ భాగం గత ప్రభుత్వ హయాంలో అక్రమ మార్గంలో సర్టిఫికెట్లను పొంది పెన్షన్ పొందుతున్నారని అభియోగం మేరకు పరిశీలన చేయనున్నారు. ఇందులో భాగంగా ఈనెల 11న 21 మంది, 12న 50 మంది పెన్షన్‌దారులను పులివెందుల ఏరియా హాస్పిటల్‌కు తమ వద్ద ఉన్న ఆధారాలతో పరిశీలనకు రావాలని క్షేత్ర స్థాయిలోని సిబ్బంది లబ్ధిదారులకు నోటీసులు జారీ చేశారు.

తప్పనిసరిగా హాజరు కావాలి..

మండల వ్యాప్తంగా నోటీసులు అందుకున్న విభిన్నప్రతిభావంతుల పెన్షన్ పొందుతున్న లబ్ధిదారులు తప్పనిసరిగా పరిశీలనకు హాజరుకావాలని ఎంపిడిఒ కృష్ణమూర్తి కోరారు. లబ్ధిదారులకు ఇప్పటికే నోటీసులు జారీ చేశామన్నారు. నోటీసులు అందుకున్న వారు తప్పనిసరిగా హాజరు కావాలని ఆయన కోరారు. పరిశీలనకు హాజరుకాకపోతే వారి పెన్షన్ హోల్డ్‌లో పెడతారని ఆయన తెలిపారు.



నిరసన వ్యక్తం చేస్తున్న డివైఎఫ్ఐ నాయకులు

కడప ఉక్కు.. మనందరి హక్కు

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

కడప ఉక్కు ఈ ప్రాంత ప్రజల హక్కు అని డివైఎఫ్ఐ పట్టణ అధ్యక్షులు ఎల్లయ్య తెలిపారు. కేంద్ర ప్రభుత్వం కడప ఉక్కుకు బడ్జెట్‌లో నిధులు కేటాయించకపోవడాన్ని నిరసిస్తూ శనివారం స్థానిక ఎస్‌సి కాలేజి హాస్టల్ వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎల్లయ్య మాట్లాడుతూ కడప ఉక్కు ఆంధ్రుల హక్కు అన్నారు. కడప ఉక్కు భిక్ష కాదన్నారు. విభజన చట్టంలో స్పష్టంగా రాసుకున్నా ఎందుకు అమలుచేయడం లేదన్నారు. అనాదిగా కడప ఉక్కుకు అన్యాయం జరుగుతూనే ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వాలు, ముఖ్యమంత్రులు మారుతున్నా కడప ఉక్కు రాత మారడం లేదన్నారు. కార్యక్రమంలో చంద్ర, అశోక్, సురేంద్ర, తేజ, రవి, మస్తాన్ పాల్గొన్నారు.



డిఎస్‌పికి ఫిర్యాదు చేస్తున్న రెడ్డి కమిటీ నాయకులు

తీన్మార్ మల్లన్నపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

రాజ్యాంగ విరుద్ధంగా వ్యాఖ్యలు చేసిన తీన్మార్ మల్లన్నపై చర్యలు తీసుకోవాలని రెడ్డి కమ్యూనిటీ రాష్ట్ర అధ్యక్షుడు సురేంద్రరెడ్డి శనివారం పులివెందుల డిఎస్‌పి మురళి నాయక్‌కు ఫిర్యాదు చేశారు. స్థానిక డిఎస్‌పి కార్యాలయంలో రెడ్డి సామాజిక వర్గంపై అనుచిత వ్యాఖ్యలు చేసిన తీన్మార్ మల్లన్నపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ నెల 2న వరంగల్ బిసి యుద్ధభేరి సభలో తీన్మార్ మల్లన్న అలియాస్ చింతపండు నవీన్ తన రాజకీయ స్వార్థం కోసం ఒసిలను ముఖ్యంగా రెడ్డి సామాజిక వర్గంపై చేసిన అనుచిత వ్యాఖ్యలను తప్పు పట్టారు. కార్యక్రమంలో రాయలసీమ కన్వీనర్ చప్పిడి జగదీశ్‌రెడ్డి, శివ లోకేష్‌రెడ్డి, రెడ్డి నాయకులు పాల్గొన్నారు.

శిల్పారామంలో నేడు సాంస్కృతిక కార్యక్రమాలు

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

శిల్పారామంలో సాంస్కృతిక కార్యక్రమాలు ఆదివారం సాయంత్రం నుండి రాత్రి 8.00 గంటల వరకు నిర్వహిస్తున్నట్లు శిల్పారామ పరిపాలనాధికారి సుధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. కోలా ప్రసాద్ వారి సహకారంతో మాస్టర్ సూర్యకుమార్ ఆధ్వర్యంలో సూర్య డ్యాన్స్ అకాడమీ, మదనపల్లి చిన్నారులచే జానపద, వెస్టర్న్ తదితర నృత్య ప్రదర్శనలు ఉంటాయన్నారు. పట్టణ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.



వాల్‌పోస్టర్లను విడుదల చేస్తున్న ఆరోగ్య సిబ్బంది

10న జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం

ప్రజాశక్తి - తొండూరు

ఈనెల 10న స్థానిక పిహెచ్‌సి ఆధ్వర్యంలో నులి పురుగుల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు డాక్టర్ ఆరిఫుల్లా, డాక్టర్ రేష్మా తెలిపారు. ఆ మేరకు శనివారం వారు వాల్‌పోస్టర్లను విడుదల చేశారు. అనంతరం డాక్టర్ ఆరిఫుల్లా మాట్లాడుతూ ఈ కార్యక్రమం ఎంపిడిఒ పర్యవేక్షణలో నిర్వహి స్తారన్నారు. అంగన్వాడీ కేంద్రాలు, ప్రాథమిక పాఠశాలలు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, జూనియర్ కళాశాలలు ప్రభుత్వ, ప్రయివేట్ విద్యాసంస్థల విద్యార్థులకు మధ్యాహ్న భోజనం ఒక గంట తర్వాత మాత్రలు మింగించాలని సూచించారు. విద్యా సంస్థల్లో ఏక కాలంలో ఈ కార్యక్రమం నిర్వహించాలని తెలిపారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ మల్లయ్య, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

సింహాద్రిపురం : పిల్లల్లో నులిపురుగుల నివారణ కోసం అందరి సహకారంతో విజయవంతం చేద్దామని ఎంపిడిఒ కృష్ణమూర్తి సూచించారు. శనివారం ఆయన మాట్లాడుతూ జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమం ఈనెల 10న జరుగుతుందన్నారు. ఏడాది నుంచి 19 ఏళ్లలోపు పిల్లలు మండలంలో దాదాపు 16,500 మంది ఉన్నారన్నారు. ప్రతి అంగన్వాడీ, ప్రభుత్వ , ప్రయివేట్, ఎయిడెడ్ స్కూలు, కళాశాలల్లో చదువుతున్న వారందరికీ ఆల్బెండజోల్-400 ఎంజి మాత్రలు పంపిణీ చేస్తామన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపిడిఒ కోరారు.

మళ్లీ పులుల సంచారం.. రైతుల్లో కలకలం

ప్రజాశక్తి - లింగాల

మొన్న రామాపురంలో చిరుతపులి విద్యుత్ ప్రమాదంతో చనిపోయిన విషయం విదితమే. ఆ సంఘటన మరువక ముందే మళ్లీ శనివారం మండలంలో పులుల కనిపించాయంటూ రైతులు ఆందోళన చెందుతున్నారు. మండల పరిధిలోని కామసముద్రంలో మిద్దె ఆదినారాయణ అనే రైతు తన పొలం వద్దకు రెండు గంటల సమయంలో వెళ్లగా పంట పొలాల్లో నుంచి ఒక పెద్దపులి, మూడు చిన్న పులులు వెళుతూండడంతో.. ఆ రైతు తహశీల్దార్ ఈశ్వరయ్యకు సమాచారమిచ్చారు. తహశీల్దార్ అటవీశాఖ అధికారులకు విషయాన్ని చేరవేశారు. రైతులు ఎవరూ ఒంటరిగా పొలాల వద్దకు వెళ్లవద్దని తహశీల్దార్ సూచించారు. అటవీశాఖ శాఖ అధికారులు పులులు సంచరించన ప్రాంతంలో పర్యటించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు.